స్నేహ సంబంధాలు ఇలాగే కొనసాగాలి


ఇంద్రకీలాద్రిలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ తదితరుల బృందం శనివారం ఇంద్రకీలాద్రిలోని కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా పాతబస్తీలోని ప్రధాన ఆలయాల అమ్మవార్లకు కనక దుర్గమ్మ తల్లి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారని..ఇందుకు సంబంధిత అధికారులను కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈవో కేఎస్. రామారావుతోపాటు వేద పండితులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాము గత నెల 14న తెలంగాణ బోనాలను విజయవాడలో వైభవంగా నిర్వహించామని..తదనంతరం దుర్గగుడి దేవస్థానం తరఫున గత నెల 26న పాతబస్తీలోని ప్రధాన అమ్మవారి ఆలయాలకు పట్టు వస్త్రాలు, గాజులు, కుంకుమ, పసుపు, చలివిడి తదితర వాటిని సమర్పించారన్నారు. ఈ సంప్రదాయం రాబోయే కాలంలో కూడా ఇదే విధంగా స్నేహ పూర్వకంగా కొనసాగాలని కోరుకుంటున్నామని గాజుల అంజయ్య అన్నారు. అనంతోజ్ హన్స్‌రాజ్, దినేష్, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారి కిడ్నాప్


ప్రగతి

చిన్నారిని తీసుకెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (సీసీ కెమెరా ఫుటేజ)

అబిడ్స్: ఆరేళ్ల చిన్నారి కిడ్నాప్‌కు గురైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక తన సోదరుడి కుమార్తె ప్రగతిని తీసుకొని శనివారం మధ్యాహ్నం కట్టెలమండిలోని పుట్టింటికి వచ్చింది. కాసేపటి తర్వాత ప్రగతి కట్టెలమండి ముత్యాలమ్మ ఆలయం ముందు ఆడుకుంటాన్నంటూ బయటకు వెళ్లింది. ఆమెతో పాటు ప్రియాంక సోదరి కుమారుడైన రుత్విక్ కూడా వెళ్లాడు. రుత్విక్ ఒక్కడే ఇంటికి రాగా ప్రగతి కనిపించలేదు. వెంటనే కుటుంబ సభ్యులు బాలిక కోసం పరిసరాల్లో గాలించి అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందుగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు రాత్రి వేళ బాలిక కిడ్నాప్ అయ్యిందని గుర్తించారు.ప్రగతిని ఓ గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెంట తీసుకెళ్తున్న సీసీ ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి తాను చేస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల కారణంగా గత కొన్ని వారాలుగా తాను ప్రజల్లో ఉండలేకపోయానన్నారు. అయితే ప్రతినిత్యం తాను మజ్లిస్ ఏరియా కమిటీల ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నానని దానికి అనుగుణంగా అధికారులకు సమస్యల పరిష్కారానికి సూచనలు ఇస్తున్నానన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

అబిడ్స్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లపాటు అవస్థలు పడిన మత్స్యకారులకు కాంగ్రెస్ హయాంలో మంచిరోజులు వచ్చాయన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు మత్స్యకారులు ఆయనను సత్కరించి వారి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఫిష్ మార్కెట్లలో తనిఖీలు చేసి వాటి అభివృద్ధికి కృషి చేస్తామని సాయికుమార్ పేర్కొన్నారు.


మెట్టు సాయికుమార్‌ను సత్కరిస్తున్న మత్స్యకారులు

'కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తా'


నియామక పత్రాన్ని అందుకున్న నర్సింగ్‌రావు

జియాగూడ: గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన టి.నర్సింగ్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా నిధులు కేటాయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ డీసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ రోహిణ్‌రెడ్డి, మిత్రకృష్ణ, బాల్‌రాజ్, లక్ష్మణ్ యాదవ్‌కు నర్సింగ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

బస్సుల సంఖ్య పెంచాలంటూ సంతకాల సేకరణ



మెహిదీపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

గోల్కొండ: ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు సీపీఎం నాంపల్లి జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మెహిదీపట్నం చౌరస్తా వద్ద ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని, దీనికి తగ్గట్టు అధికారులు బస్సుల సంఖ్యను పెంచడం లేదన్నారు. గత మూడేళ్ల కాలంలో ఆర్టీసీ వారు సుమారు వెయ్యి బస్సులు తగ్గించారన్నారు. ఉన్న బస్సులతోనే ఆర్టీసీ మనుగడ సాగిస్తుందని పేర్కొన్నారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు అజయ్‌బాబు, నాయకులు యాదగిరి, రమేష్, వెంకటేష్, కృష్ణ, జహంగీర్, ఫరీద్ ఉన్నారు.

15 నుంచి ఉర్దూఘర్‌లో ఎగ్జిబిషన్

యాకుత్‌పురా: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మొఘల్‌పురా ఉర్దూఘర్‌లో పురాతన కరెన్సీ, నాణేలు, స్టాంప్‌ల ప్రత్యేకతపై ఆల్ ఇండియా చార్మినార్ ఇండిపెండెన్స్ డే ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించనున్నామని ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కదీరుల్లా ఖాద్రీ తెలిపారు. శనివారం మొఘల్‌పురాలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15, 16, 17వ తేదీలలో నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో ప్రపంచంలోని అరుదైన కరెన్సీలు, పురాతన నాణేలను, స్టాంప్ పేపర్లు, పెయింటింగ్‌ను ప్రదర్శించనున్నామని ఆయన వివరించారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దళితుల కులగణన అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి


మాట్లాడుతున్న బైరి వెంకటేశం మోచీ

సుల్తాన్‌బజార్: దళితుల కులగణన నిర్వహించిన అనంతరం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచీ అన్నారు. శనివారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికార భవన్‌లో నిర్వహించిన ఎస్సీ 57 ఉపకులాల పోరాట సమితి రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదిగలు, ఉపకులాల సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. దళితుల్లో కులగణన చేపట్టిన అనంతరమే జనాభా దామాష ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీవర్గీకరణ చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వీధి కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు

- పాతబస్తీలో ఇప్పటి వరకు పాజిటివ్ రేబిస్ కేసులు లేవు
- కుక్కలకు కుటుంబ నియంత్రణతో పాటు వ్యాక్సినేషన్ చేస్తున్నాం
- సాక్షితో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



చార్మినార్: జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ (పశు వైద్య) విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కుక్కలు బెడద ఎక్కువ కావడంతో స్థానిక ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. పరిస్థితి విషమించడంతో హైకోర్టు సైతం జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ నేపథ్యంలో పాతబస్తీలో కుక్కల బెడదపై జీహెచ్ఎంసీ, పశు వైద్య విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు, సలహాలు, సూచనలు 'సాక్షి'కి వివరించారు. ఆయన మాట్లాడుతూ..ఇప్పటికే జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వీధి కుక్కల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

- పలు ప్రాంతాల్లో కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి అనంతరం అదే ప్రాంతంలో వదిలేస్తున్నాం.

సర్జరీ అనంతరం ఎందుకు మళ్లీ అక్కడే వదులుతారు?

- అనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు సర్జరీ అనంతరం మళ్లీ అక్కడే వదులుతాం.

కుక్కలకు కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ ఎంత వరకు జరిగింది?

- ఈ ఏడాది ఇప్పటి వరకు 2687 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి..5665 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది.

యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ చేస్తున్నారా..?

- జూలై 6న జూనస్ డే సందర్భంగా యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేశాం.

కుక్కల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

- పరిధిలోని మలక్‌పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిల్‌లలో మొత్తం 10 వాహనాలు, సిబ్బందితో కుక్కలను పట్టుకోవడానికి రెండు షిప్టుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

పాఠశాల చిన్నారులు ఎక్కువగా కుక్క కాటుకు గురవుతున్నారు. ఇందుకోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

- త్వరలోనే పాఠశాలలో కుక్క కాటు నివారణ చర్యలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సడన్‌గా కుక్క దాడి చేసి కరిస్తే ఏం చేయాలి?

- కుక్క కాటు వేసిన వెంటనే గాయాన్ని 10 నిమిషాల పాటు గట్టిగా అదిమి పట్టి.. ఆయా భాగాన్ని సబ్బుతో శుభ్ర పరచుకొని స్థానిక వైద్యుని సంప్రదించాలి. తప్పని సరిగా వాక్సిన్ వేయించుకోవాలి.

వ్యాక్సిన్ ఎక్కడ వేస్తారు..?

- నగరంలోని నల్లకుంట ఫీవర్ హాస్పిటల్, హిమాయత్ నగర్‌తో పాటు పాతబస్తీలోని కొన్ని ఏరియా ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తారు.

కుక్కల బెడద నివారణకు ఎవరిని సంప్రదించాలి?

- కుక్కల బెడదపై ప్రజలు చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్, రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు చార్మినార్ సర్కిళ్లకు సంబంధించి డాక్టర్ శ్రీకాంత్ (915469429), సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా సర్కిళ్ల కి సంబంధించి వెటర్నరీ అధికారి డాక్టర్ వసీం (8919690076)ను సంప్రదించాలి.

డీలక్స్ కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా అలీఖాన్



గోల్కొండ: డిలక్స్ కాలనీ సంక్షేమ సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా హిదాయత్ ఆలీఖాన్ నియమితులయ్యారు. కాలనీ సంక్షేమ సంఘం వారు ఆయనను ఏకగ్రీవంగా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వీనస్ విద్యా సంస్థల కరస్పాండెంట్‌గా ఉన్న మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్ మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు.

నిజాం కళాశాల విద్యార్థినుల ఆందోళన


గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల డిగ్రీ విద్యార్థినులకు 100 శాతం యూజీ విద్యార్థినులకే కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వసతి గృహంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శనివారం నిజాం కళాశాల ఆవరణలో విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ..యూజీకి 50 శాతం, పీజీకి 50 శాతం వసతి గృహాన్ని కేటాయిస్తామని తెలిపిన ప్రిన్సిపాల్ ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. డిగ్రీ విద్యార్థినుల కోసం కట్టిన వసతి గృహమని అది డిగ్రీ విద్యార్థులకే చెందాలని డిమాండ్ చేశారు. తమకు హాస్టల్‌ను కేటాయించేంత వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ తదితరులు

అబిడ్స్: అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎంఎన్‌జే ఆసుపత్రి వద్ద దాదాపు 500 మంది రోగుల సహాయకులకు ఆహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..సమాజ సేవలోనే ఎంతో తృప్తి, సంతోషం ఉంటుదన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి వద్ద తరచూ అన్నదానాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కస్తూరి వెంకట్, బొల్లిగడ్డ శంకర్, కేఆర్.రాజ్‌కుమార్, ఖాలీద్ అహ్మద్, మహ్మద్ వహీద్, వైదిక్ శాస్త్రి, ఆసుపత్రి సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధూల్‌పేట్‌లో గంజాయి స్వాధీనం



అఫ్జల్‌గంజ్: ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా ఎక్సైజ్ పోలీసులు ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ముమ్మర దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆపరేషన్ ధూల్‌పేట్ ఎక్సైజ్ స్పెషల్ అధికారి అంజిరెడ్డి పర్యవేక్షణలో ఈ దాడులు చేపట్టారు. ధూల్‌పేట్, పురానాపూల్, జియాగూడ, కుమ్మరివాడి ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో దాదాపు 5.068 కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిఖిల్‌కుమార్, అఖిలేష్ సింగ్, హమీష్, ఆశీష్, గణేష్, సాయికుమార్‌ను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ స్పెషల్ అధికారి అంజిరెడ్డితో పాటు ఎక్సైజ్ సీఐలు మధుబాబు, గోపాల్, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

విద్యాభ్యాసంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరం


అవగాహన కల్పిస్తున్న ప్రజా ఆరోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్ర నాయక్

చార్మినార్: విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. జిల్లా వైద్య శాఖ డీఎం హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, జీహెచ్ఎంసీ మలేరియా విభాగం చీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబుతో కలిసి శనివారం చార్మినార్ ప్రాంతంలో పర్యటించారు. పటేల్ మార్కెట్‌లోని అగర్వాల్ శిక్ష సమితి పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణ, చర్యలపై అవగాహన కల్పించారు. దోమలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామల శ్రీనివాస్, ఎస్‌పీ హెచ్‌ఓ డాక్టర్ శశికళ, యూపీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ అరుణ, మలేరియా పాల్గొన్నారు.

ప్రజా పాలన కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



యాకుత్‌పురా: నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రజా పాలన దరఖస్తుల పరిశీలన కేంద్రలను ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ శనివారం పరిశీలించారు. తలాబ్‌కట్టా, యాకుత్‌పురా, రెయిన్‌బజార్, సంతోష్‌నగర్, కుర్మగూడ ప్రాంతాల్లో పర్యటించి అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బంది, దరఖాస్తు దారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దరఖాస్తు దారులు గ్యాస్, విద్యుత్ బిల్లులకు సంబంధించిన వివరాలను అందించి సరి చేసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు తలాబ్ చంచలం, సంతోష్ నగర్ డివిజన్ల కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, ముజఫర్ హుస్సేన్, మజ్లిస్ పార్టీ నాయకలు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకుందాం


విరాళాలను సేకరిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

గన్‌ఫౌండ్రీ: కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. శనివారం సీపీఐ నగర శాఖ ఆధ్వర్యంలో అబిడ్స్ జీపీఓ వద్ద విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వైపరిత్యంతో అతలాకుతలమైన వాయినాడ్ ప్రాంతం తిరిగి కోలుకోవడానికి ఎంతో సమయం పడుతుందన్నారు. కేంద్రప్రభుత్వం తక్షణమే వయనాడ్‌కు నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటి.నర్సింహ, జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, యాదగిరి, వి.స్టాలిన్ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు


వారోత్సవాల్లో పాల్గొన్న సూపర్‌వైజర్ కవిత, అనిత తదితరులు

అబిడ్స్: తల్లిపాల వారోత్సవాలను ఇమ్లియాబాగ్ అంగన్‌వాడీలో ఘనంగా నిర్వహించారు. పలువురు తల్లులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ..చంటిపిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు మంచి పౌష్టికాహారం భుజించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, నాగలక్ష్మి, నిర్మల, సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం, గోధుమలను తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



గౌలిపురా: అక్రమంగా పీడీఎస్ బియ్యం, గోధుమలను తరలిస్తున్న ముగ్గురిని భవానీ నగర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..నషేమాన్‌నగర్‌కు చెందిన షేక్ రషీద్ (53) తన కుమారుడు షేక్ ఆయాజ్ (24)తో కలిసి అఫ్జల్‌గంజ్‌లో రవాణా వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో బస్తీల్లో తిరుగుతూ ప్రజల వద్ద పీడీఎస్ బియ్యం, గోధుమలను కొనుగోలు చేసి రైస్ డీలర్లు తలాబ్‌కట్టాకు చెందిన షేక్ సాబేర్, నవాబ్, మహారాష్ట్రకు చెందిన సూర్యకాంత్‌లకు విక్రయించే వారు. తలాబ్‌కట్టాకు చెందిన మహ్మద్ అక్తర్ (48) సైతం తన నివాసంలో కిరాణా షాపును నిర్వహిస్తున్నాడు. తక్కువ ధరలకు రేషన్ బియ్యాన్ని సేకరించి ఆమన్‌నగర్‌కు చెందిన రైస్ డీలర్ అక్రమ్‌కు విక్రయించే వాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు భవానీగర్ పోలీసులతో కలిసి ఈ రెండు స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో షేక్ రషీద్, షేక్ ఆయాజ్, మహ్మద్ అక్తర్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2.97,100ల విలువ చేసే నుంచి 102 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 31.10 క్వింటాళ్ల గోధుమలను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం భవానీనగర్ పోలీసులకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో శివ సహస్రనామ మహాయజ్ఞం


మహాయజ్ఞంలో పాల్గొన్న దామోదర్ రెడ్డి తదితరులు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక శివగంగానగర్‌లోని లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో శనివారం త్రయోదశ 13వ శ్రీ శివ సహస్ర నామ మహాయజ్ఞం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారెడ్డి దామోదర్‌రెడ్డి, ట్రస్టీలు పోతుగంటి రమేష్, సురం సత్యనారాయణ, ఎర్రోజు బాలాచారి, గోషిక రాజ్యలక్ష్మి తదితరుల యజ్ఞంలో పాల్గొన్నారు. సుమారు వంద మంది మహిళలు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రామకోటి రాశారు. ఆలయంలో శ్రీ మద్ భగవద్గీత, రుద్రాభిషేకం, శాంతి మంత్రాలు పఠించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన



చార్మినార్: విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర ఇతర సమస్యలు ఏవైనా ఎదురైతే వెంటనే 1912లో సంప్రదించాలని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ డివిజన్ డీఈ లింగయ్య తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ డివిజన్ పరిధిలోని కీలకమైన అన్ని ప్రాంతాల్లో తాము పర్యటిస్తూ క్షేత్రస్థాయి విద్యుత్ సరఫరాను పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం పటేల్ మార్కెట్‌లోని వస్త్ర వ్యాపారులతో సమావేశమై విద్యుత్ సరఫరా సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నామన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



గోల్కొండ: చదువుతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని టీఎఫ్‌సీవో కార్యాలయంలో మహ్మదీ లైన్స్, కంపెనీ బాగ్‌లకు చెందిన పలువురు పిల్లల చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పలు కుటుంబాల వారు తమ పిల్లలను పాఠశాలల్లో కాకుండా వివిధ రకాల పనులకు పంపడం సరికాదన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో టీఎఫ్‌సీవో కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.

పరామర్శ


ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈటల రాజేందర్

చాంద్రాయణగుట్ట: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఆర్.ఆంజనేయులు కుటుంబసభ్యులను శనివారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. పార్లమెంట్ సెషన్స్ కారణంగా మంగళవారం జరిగిన అంత్యక్రియలకు హాజరుకాలేక పోయినందున శనివారం పూల్‌బాగ్ చమాన్ ప్రాంతంలోని ఆయన నివాసానికి విచ్చేసి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు వీకే మహేష్, అంజనేయులు ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్, జమ్మిచెట్టు రాజు పాల్గొన్నారు.

'కళా సంస్కృతులు సామరస్యాన్ని పెంపొందిస్తాయి'

సుల్తాన్‌బజార్: కళలు, సాహిత్యం, సంస్కృతి సమాజంలో సామరస్యాన్ని పెంపొందిస్తాయని శాంతా–వసంత ట్రస్టు అధ్యక్షులు పద్మభూషణ్ డాక్టర్ కెవి.వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ట్రస్టు తరఫున తెలంగాణ సారస్వత పరిషత్తులో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఎంబీఎస్ ప్రసాద్‌కు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని, ప్రముఖ అన్నమయ్య పరిశోధకుడు గంధం బసవశంకర్‌రావుకు కోడూరి వెంకటరమణారెడ్డి ఉత్తమ సాహితీ సేవా పురస్కారాన్ని తెలంగాణ ప్రభుత్వపూర్వ సలహాదారుడు డాక్టర్ కెవి.రమణాచారితో కలిసి ప్రదానం చేశారు.

భార్యను కత్తితో పొడిచిన కేసులో భర్తకు రిమాండ్

నాంపల్లి: భార్యను పొడిచిన కేసులో భర్తను నాంపల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తెలిపిన వివరాల ప్రకారం..ఆగాపురాకు చెందిన షేక్ అన్వర్(40) కూలి. అతడికి షేక్ రుబినాతో వివాహం అయ్యింది. వీరికి ఒక బాబు, ఒక బాలిక ఉన్నారు. భర్త విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ వివాదం పెండింగ్‌లో ఉంది. రుబీనా ఏసీగార్డ్స్‌లోని వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం ఎదుట ఉండే ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో పనికి వెళ్తుంది. గురువారం ఉదయం 10 గంటలకు పనికి వెళ్లి వస్తున్న రుబీనాను అన్వర్ కత్తితో పొడిచి పారిపోయారు. స్థానికులు చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. కాగా 2015లో వదినను కత్తితో పొడిచిన కేసులో 2020లో జైలుకు వెళ్లి బెయిలపై బయటకు వచ్చాడు. బయటకు వచ్చిన అన్వర్ ఆమె భార్యపై కత్తితో దాడి చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బేగంపేట రైల్వే స్టేషన్‌లో 10 కేజీల గంజాయి స్వాధీనం

నాంపల్లి: అక్రమంగా తరలిస్తున్న 10 కేజీల గంజాయిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో నార్కోటిక్ స్మగ్లింగ్‌లను అరికట్టడానికి నార్కోస్ ఆపరేషన్‌లో భాగంగా నిరంతర దాడులు చేస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 1న ఎస్.ఎస్.ఎస్‌తో కూడిన ఉమ్మడి బృందాలు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటుగా బేగంపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాల్లో సోదాలు చేయగా గుర్తుతెలియని వ్యక్తి బేగంపేట రైల్వే స్టేషన్‌లో ఒక బ్యాగ్‌తో తచ్చాడుతూ కనిపించాడు. అందులో ప్లాస్టిక్ బ్రౌన్ టేపుతో చుట్టి ఉన్న పది కేజీల ప్యాకెట్‌ను కలిగి ఉండటాన్ని గుర్తించారు. అందులో మొత్తం ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.2,50,000 ఉంటుంది. స్వాధీనం చేసుకున్న గంజాయిని నాంపల్లి ఎక్సైజ్ శాఖకు అప్పగించారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్కోస్ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటి వరకు రూ.14,82,500 విలువ చేసే 61.984 కేజీల బరువు కలిగిన గంజాయిని ఆరు చోట్ల జరిపిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలియజేశారు.